# నూతనోత్తేజం



ఆమనగల్లులో జరిగిన రైతు దీక్ష ర్యాలీలో పాల్గొన్న అశేష జనవాహిని (ఫైల్)

- షాబాద్, ఆమనగల్లులో జరిగిన దీక్షలతో బీఆర్ఎస్ శ్రేణుల్లో రెట్టింపు ఉత్సాహం
- అంచనాలకు మించి హాజరైన రైతులు, ప్రజలు
- హామీలు నెరవేర్చని కాంగ్రెస్ సర్కార్‌పై ప్రజాగ్రహం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెబుతామని స్పష్టీకరణ

జిల్లాలోని షాబాద్, ఆమనగల్లు నియోజకవర్గాల్లో నిర్వహించిన బీఆర్ఎస్ రైతు దీక్షలతో జిల్లా పార్టీలో రెట్టింపు ఉత్సాహం నెలకొన్నది. వరుసగా నిర్వహించిన రైతు దీక్షలకు బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు అంచనాలకు మించి హాజరై ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను దీక్షల్లో కనబరుస్తున్నారు. షాబాద్, ఆమనగల్లులో నిర్వహించిన రైతు దీక్షలకు కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవడంతో రైతుల నుంచి పెద్దఎత్తున స్పందన లభించింది. దీంతో జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్తేజం నెలకొన్నది. స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా పార్టీ ఆదేశాల మేరకు ఆయా నియోజకవర్గాల్లో మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ప్రజలకు కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్న గొంతుకతో బీఆర్ఎస్ ప్రజల్లోకి దూసుకువెళుతున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు కొనసాగిస్తామని చెప్పి.. అధికారంలోకి రాగానే వాటిని అమలు చేయకపోవడంపై కాంగ్రెస్‌పై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నది. ఎక్కడికక్కడ ప్రభుత్వాన్ని, ఎమ్మెల్యేలు, అధికారులను నిలదీసేందుకు ప్రజలు ముందుకొస్తున్నారు.

– రంగారెడ్డి, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ)

### స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి



ఎన్నికల ముందు అలవి కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. అరచేతిలో వైకుంఠం చూపించిన కాంగ్రెస్ హామీలు అమలు చేయకుండా కాలయాపన చేయడం సిగ్గుచేటు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను చిత్తుచిత్తుగా ఓడించి, ప్రజల కోసం పనిచేసే బీఆర్ఎస్‌ను గెలిపించాలి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది, కాని, అభివృద్ధి చెందిన రాష్ట్రాన్ని రేవంత్‌రెడ్డి అప్రతిష్టపాలు చేస్తున్నాడు. ఇప్పటికైనా ప్రజలు కళ్లు తెరిచి కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలి.

– క్యామ మల్లేశ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు

### దూసుకెళుతున్న బీఆర్ఎస్

కాంగ్రెస్ హయాంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా నీరుగారిందన్న నినాదంతో బీఆర్ఎస్ ప్రజల్లోకి దూసుకుపోతున్నది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సారథ్యంలో మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులు, పార్టీ బాధ్యులు కాంగ్రెస్ చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎత్తిచూపుతున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా ప్రజలను నట్టేట ముంచుతున్నదని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సరైన బుద్ధి చెప్పాలన్న సంకల్పంతో బీఆర్ఎస్ ముందుకు సాగుతున్నది. ప్రజలు బీఆర్ఎస్ నిర్వహిస్తున్న అన్ని దీక్షలు, ధర్నాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు.



షాబాద్‌లో జరిగిన రైతు దీక్షకు హాజరైన రైతులు, ప్రజలు (ఫైల్)

# గాయం ఒకచోటైతే.. మందు మరోచోట

సిటీబ్యూరో, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): నదులు, వాగుల పరీవాహక ప్రాంతాల్లో యథేచ్ఛగా ఇసుక దందా సాగుతూ ఉంటే పోలీసులు మాత్రం హైదరాబాద్ నగరంలో చిరువ్యాపారులపై విరుచుకుపడుతున్నారు. గాయం ఒకచోటైతే మందు మరొక చోట పెట్టినట్టు ఇసుక రీచ్‌లు, నదీ పరివాహక ప్రాంతాలు లేని హైదరాబాద్‌లో అక్రమ ఇసుక దందా నడుస్తూ ఉందంటూ వ్యాపారులను వేధిస్తున్నారు. కాగా ఇసుక నిల్వ చేసుకోవడంతప్ప తాము ఏ నేరం చేశామో అర్థం కావడం లేదని వ్యాపారులు విస్మయానికి గురవుతున్నారు.

### నిర్మాణాలపై ప్రభావం..!

యథేచ్ఛగా సాగుతున్న ఇసుక దందాపై ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి దృష్టిపెట్టారు. ఈ నేపథ్యంలోనే కృష్ణా, గోదావరి నది పరీవాహక ప్రాంతాలపై దృష్టి పెట్టాల్సిన అధికారులు ఇసుకు నిల్వ చేసుకున్న చిరు వ్యాపారులపై తమ ప్రతాపం చూపిస్తున్నారు. ముఖ్యంగా రాచకొండ కమిషనరేట్ పరిధిలో వ్యాపారులకు వేధింపులు అధికమయ్యాయి. సాధారణంగా ఇసుక రీచ్‌లున్న తుపాకులగూడెం, భద్రాచలం, కరీంనగర్, పెద్దపల్లి తదితర ప్రాంతాలలో ప్రభుత్వానికి నిబంధనల ప్రకారం ఇసుక ధర చెల్లించి లారీల్లో హైదరాబాద్‌కు ఇసుకను రవాణా చేస్తుంటారు. కొందరు లారీల యజమానులు నేరుగా బహుళ అంతస్తుల నిర్మాణాలకు సరఫరా చేస్తుండగా ఇంకా కొందరు అడ్డాలపై తెచ్చి పెడుతుంటారు. ఈ అడ్డాల నుంచి చిన్నచిన్న నిర్మాణాలకు తక్కువ మొత్తంలో ఇసుక కావాల్సిన వాళ్లు కొనుగోలు చేస్తుంటారు. లారీలు ఎక్కువ సేపు ఇసుకతో ఉండలేవు, దీంతో కొందరు ఆ ఇసుకను కొనుగోలు చేసి ఖాళీ ప్రదేశాలను కిరాయికి తీసుకొని, లీజ్‌లకు తీసుకొని దానిని ఇసుక డంప్(డంగల్)గా వాడుకుంటారు. ఇక్కడి నుంచి రెండు మూడు టన్నులు అవసరాలను బట్టి చిన్న చిన్న వాహనాల్లో కొనుగోలు చేసుకుంటూ కావాల్సిన వాళ్లు తీసుకెళ్తుంటారు. లారీలో తెచ్చిన ఇసుకను కొని, దానిని ఈ చిరువ్యాపారులు రీసేల్ చేస్తుండడంతో కొద్ది మేర ధరను పెంచుకుంటారు. నిబంధనల ప్రకారం ఇసుక రీచ్‌ల నుంచి తెచ్చిన ఇసుకనే ఇక్కడ కొని దానిని విక్రయిస్తున్నారు. ఇలా నగరంతోపాటు నగర శివారు ప్రాంతాల్లో ప్రధాన రోడ్లకు సమీపంలో ఇసుక డంప్‌లు ఏర్పాటు చేస్తూ వేలాది మంది ఈ వ్యాపారంపై ఆధారపడి జీవిస్తున్నారు. అవసరమైన వారికి ఇసుకను అందించడంలో ఇలాంటి డంప్‌లు పట్టణ ప్రాంతవాసులకు ఉపయోగపడుతున్నాయి. నిర్మాణాలకు కావాల్సిన ఇసుక ఇక్కడి నుంచి ఎక్కువగా సరఫరా అవుతుంది. అలాకాకుండా నేరుగా ఇసుక రీచ్‌ల నుంచి ఇసుకను కొనాలంటే తక్కువ మొత్తంలో కావాల్సిన వారికి దొరకడం కష్టంగా మారుతున్నది. ఇది నిర్మాణరంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపే అవకాశాలున్నాయి.

### నిల్వకు లైసెన్సులు తీసుకుంటాం

శివారుల్లో ఇసుకను కొని నిల్వచేసి విక్రయించే వ్యాపారం గత 30 ఏండ్లుగా సాగుతున్నది. అలాంటిది ఇప్పుడు ఇది అక్రమ ఇసుక దందాకు కారణమవుతుందంటూ దీనిపై ఆధారపడి ఉన్న వ్యవస్థను మొత్తం ప్రభుత్వం ధ్వంసం చేస్తున్నదంటూ పలువురు వ్యాపారులు వాపోతున్నారు. కావాలంటే లైసెన్స్‌లు పెట్టుకునే వెసులుబాటు కల్పిస్తే తాము అందుకు సిద్ధమని వ్యాపారులు చెబుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇలాంటి సమస్య పరిష్కారానికి అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతంలో ఇసుక డంప్ చేసుకునే కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆలోచన చేశారని వ్యాపారులు పేర్కొంటున్నారు. అక్రమంగా ఇసుకను తరలించే వాహనాలను ఆయా ప్రాంతాలలోని చెక్‌పోస్టుల వద్దే నిలువరించే అవకాశాలున్నాయి.




నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I | హైదరాబాద్, గురువారం 20 ఫిబ్రవరి 2025 | VIKARABAD




రోజురోజుకూ నెమ్మదిగా ఎండల తీవ్రత పెరిగిపోతూ ఉన్నది. దీంతో మధ్యాహ్నం వేళల్లో ఉష్ణ ప్రతాపాన్ని తట్టుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్న ఓ ఆటోడ్రైవర్

## ముదురుతున్న ఎండలు..

డిమాండ్‌కు అనుగుణంగా నీటిని వదులుతున్న అధికారులు

# ముంచుకొస్తున్న నీటి ఎద్దడి

గృహావసరాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

రంగారెడ్డి జిల్లాలో ఎండలు మండుతుండటంతో పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తుతున్నది. రెండు మూడు రోజులకోసారి తాగు నీరు సరఫరా అవుతుండటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పలు గ్రామాల్లో ఇప్పటినుంచే తాగునీటి సమస్య తలెత్తుతున్నదని, ఈ సమస్య మునుముందు మరింత జటిలమవుతుందని ప్రజలు భయపడుతున్నారు. జిల్లాలోని మాడ్గుల, తలకొండపల్లి, యాచారం, మంచాల వంటి మండలాల్లో తాగునీటి సమస్య ఇప్పటికే తలెత్తుతున్నది. మంచి నీటి కోసం స్థానికంగా వనరులు లేకపోవడంతో ప్రజలంతా మిషన్ భగీరథ నీటిపైనే ఆధారపడ్డారు. మిషన్ భగీరథ నీటి విడుదలలో క్షేత్ర స్థాయి సిబ్బంది నిర్లక్ష్య వైఖరి కారణంగా కూడా నీటి సమస్య ఉత్పన్నమవుతున్నది. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలన్నింటికీ, మున్సిపాలిటీల్లోని ఆయా ప్రాంతాలకు డిమాండ్‌కు అనుగుణంగా మిషన్ భగీరథ నీటిని విడుదల చేస్తున్నారు. ఎండాకాలంలో నీటి వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే సమస్య తలెత్తుతున్నది. మరోవైపు, మరమ్మతుల కారణంగా కూడా నీటి సరఫరా రోజుల తరబడి నిలిచిపోవడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

– రంగారెడ్డి, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ)



మాడ్గుల మండలం ఓ గిరిజన తండాలో తాగునీటి కోసం ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన తండావాసులు (ఫైల్)

### జిల్లాకు రోజు 106 ఎంఎల్‌డీల నీరు

జిల్లాలోని 21 మండలాలకు ప్రతిరోజూ మిషన్ భగీరథ ద్వారా 106 ఎంఎల్‌డీల కృష్ణా తాగునీరు సరఫరా చేస్తున్నారు. జిల్లాకు రోజుకు 108.37 ఎంఎల్‌డీల తాగునీరు అవసరముండగా.. ప్రస్తుతం 106 ఎంఎల్‌డీల నీటిని మాత్రమే అందిస్తున్నారు. దీంతో జిల్లా డిమాండ్‌కు తగ్గట్టు నీరురాక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జిల్లావ్యాప్తంగా 989 ఆవాసాలుండగా.. డిమాండ్‌ను బట్టి ప్రతిరోజూ లేదా రోజు విడిచి రోజు తాగునీరు అందించాల్సి ఉంటుంది. కానీ, మారుమూల ప్రాంతాలకు మాత్రం రెండు మూడురోజులకోసారి మాత్రమే తాగునీరు వస్తున్నదని ప్రజలు వాపోతున్నారు. అలాగే మండలాల్లోని చివరి గ్రామాలకు నీటి సరఫరా సరిగా జరగడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు, గ్రామాల్లో బోరుబావులు, చేతిపంపులు వంటి వసతులు ఉన్నప్పటికీ.. వాటినెవరూ సరిగా వినియోగించడంలేదు. వచ్చే వేసవిలో చేతిపంపులు, బోరు బావులను వినియోగంలోకి తీసుకొచ్చి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవడానికి అధికారులు సమాయత్తమవుతున్నారు.

### పెరిగిన ప్రైవేటు నీటి దందా

జిల్లాలో వేసవి కాలంలో నీటి వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ట్యాంకర్లు, ఫిల్టర్‌ల ద్వారా అందించే తాగునీటి వ్యాపారం జోరుగా సాగుతున్నది. ప్రజల అవసరాలకు సరిపడా కృష్ణాజలాలు రాకపోవడంతో ఎక్కువమంది ఫిల్టర్ నీటిపైనే ఆధారపడ్డారు. అలాగే గృహ అవసరాలకు ట్యాంకర్ల ద్వారా నీటి కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో ట్యాంకర్‌కు రూ.600 నుంచి 700 వరకు ధరలు పెంచారు. అలాగే ఫిల్టర్ నీటిని 20 లీటర్‌ల క్యాన్‌ను రూ.10 నుంచి 15 రూపాయలకు విక్రయిస్తున్నారు. మును ముందు ఈ సమస్య మరింత తీవ్రరూపం దాల్చే అవకాశాలు ఉన్నాయి.

- మిషన్ భగీరథ నీటిపైనే ప్రజల ఆశలు
- మరమ్మతుల కారణంగా రోజుల తరబడి ఇబ్బందులు
- జిల్లాలోని పలు గ్రామాల్లో తాగునీటి కోసం రోడ్డెక్కుతున్న మహిళలు
- జోరుగా సాగనున్న తాగునీటి వ్యాపారం

### నీటి ఎద్దడి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు

జిల్లాలో మంచినీటి సమస్య తలెత్తకుండా అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. వేసవిలో పెరుగుతున్న నీటి అవసరాలను గుర్తించి, అదనంగా నీటి సరఫరా జరిగేలా చర్యలు చేపడుతున్నాం. జిల్లాలోని 989 ఆవాసాలు, 16 మున్సిపాలిటీలలో వేసవిని దృష్టిలో ఉంచుకుని, అవసరాలను తెలుసుకుని వాటికి అనుగుణంగా నీటిని సరఫరా చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. అవుటర్ లోపలి గ్రామాలన్నింటికీ హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ ద్వారా తాగునీటిని అందిస్తున్నాం. అవుటర్ వెలుపల మున్సిపాలిటీలతోపాటు గ్రామాలకు మిషన్ భగీరథ నీటిని అందిస్తున్నాం. ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం.

– మిషన్ భగీరథ ఈఈ రాజేశ్వర్

# ధ్రువపత్రాల జారీలో జాప్యం!

- పది రోజులు గడిచినా చేతికి అందని జనన, మరణ సర్టిఫికెట్లు
- 30 సర్కిళ్లలో 3500ల మేర పెండింగ్ జాబితాలోనే
- మెడికల్ ఆఫీసర్లు, ఏఎంసీలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు
- జీహెచ్ఎంసీ పనితీరుపై ప్రజల ఆగ్రహం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జనన, మరణ ధ్రువపత్రాల జారీ ప్రక్రియలో తీవ్ర జాప్యం నెలకొంటున్నది. వారం రోజుల వ్యవధిలో చేతికి అందాల్సిన జనన, మరణ ధృవపత్రాలు 2 వారాలు గడిచినా అందడం లేదు. ఫలితంగా ఈ సర్టిఫికెట్ల కోసం అటు తల్లిదండ్రులు, ఇటు డెత్ సర్టిఫికెట్లకు బాధిత కుటుంబ సభ్యులు మీ సేవ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాలకు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పది రోజులు గడిచినా జనన ధృవపత్రం ఆన్‌లైన్‌లో రావడం లేదని బన్సీలాల్‌పేటకు చెందిన మహాలక్ష్మి అనే గృహిణి ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, 30 సర్కిళ్ల పరిధిలోని దాదాపు 3500 సర్టిఫికెట్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తున్నది. సంబంధిత ఏఎంఓహెచ్‌లు, ఏఎంసీలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేమి కారణంగానే సర్టిఫికెట్ల జారీలో ఆలస్యం అవుతూ సమస్యకు కారణమవుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

### తప్పుల తడక.. ఇంకో సమస్య

జీహెచ్ఎంసీ పరిధిలో జారీ అయ్యే బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లు తప్పుల తడకగా ఉంటున్నాయి. దీంతో ధ్రువపత్రాలు పొందేవారికి ఇది ఇంకో సమస్యగా మారింది. ఒక్కో సర్కిల్‌లో దాదాపు 500 నుంచి 700 వరకు కరెక్షన్ ఫైళ్లు పెండింగ్‌లో ఉండడం అధికారుల పనితీరుకు నిదర్శనంగా చెప్పవచ్చు. వాస్తవంగా జీహెచ్ఎంసీ పరిధిలోని 30 సర్కిళ్లలో ప్రతి ఏటా గరిష్ఠంగా మూడున్నర లక్షల వరకు జననాలు జరుగుతున్నాయి. వీటిలో ప్రైవేట్ దవాఖానాల్లో జనరేట్ చేస్తున్న బర్త్ సర్టిఫికెట్లలో తప్పులు తక్కువగా ఉంటుండగా.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నమోదవుతున్న ధ్రువపత్రాల్లో తప్పులు దొర్లుతున్నట్లు తెలుస్తున్నది. బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీకి సంబంధించిన రిజిస్ట్రార్లుగా స్థానిక మెడికల్ ఆఫీసర్లు వ్యవహరిస్తుంటారు. కానీ చాలా సర్కిళ్లలో మెడికల్ ఆఫీసర్లు లేకపోవడంతో అసిస్టెంట్ మెడికల్ కమిషనర్లు (ఏఎంసీ)లను బర్త్, డెత్ రిజిస్ట్రార్లుగా నియమించారు. ఈ నేపథ్యంలోనే బేగంపేట సర్కిల్ పరిధిలోని గాంధీ ఆసుపత్రి, గోషామహల్ సర్కిల్ పరిధిలోని సుల్తాన్ బజార్ ప్రభుత్వ దవాఖాన, పేట్ల బురుజులోని సర్కారు వెటర్నరీ హాస్పిటల్, మెహిదీపట్నం సర్కిల్‌లోని నిలోఫర్ దవాఖాన పరిధిలో భారీగా కరెక్షన్ ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.



### ఇసుక డంపులపై పోలీసుల దాడులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ) : ఇసుకను నిల్వ చేసిన వ్యాపారులపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు కొనసాగుతున్నాయి. బుధవారం సౌత్‌వెస్ట్ జోన్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సంయుక్తంగా నాంపల్లి మండల రెవెన్యూ అధికారులతో కలిసి ఇసుక డంపులపై దాడులు నిర్వహించారు. పక్కా సమాచారంతో పురానాపూల్‌లోని జుమ్మెరాత్ బజార్‌లో ఉన్న సందీప్ వే బ్రిడ్జ్, సందీప్ కన్‌స్ట్రక్షన్ అండ్ మెటీరియల్ గోడౌన్‌పై దాడులు చేసి 1.20 లక్షల విలువ చేసే 60 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు.



బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, కార్తీక్‌రెడ్డి

# బీఆర్ఎస్‌లో చేరికలు

## బీఆర్ఎస్‌కు ప్రజల్లో ఏమాత్రం ఆదరణ తగ్గలేదు : మాజీ మంత్రి సబితారెడ్డి

## కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలో..: కార్తీక్‌రెడ్డి

- గులాబీ కండువా కప్పుకొన్న 200 మంది కాంగ్రెస్ కార్యకర్తలు
- పార్టీలోకి ఆహ్వానించిన మాజీ మంత్రి సబిత, కార్తీక్ రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 19 : భారత రాష్ట్ర సమితికి ప్రజల్లో ఏమాత్రం ఆదరణ తగ్గలేదని రాష్ట్ర మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌కు చెందిన 200 మందికి పైగా కాంగ్రెస్, ఎంఐఎం నాయకులు, మహిళా కార్యకర్తలు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎస్.వెంకటేశ్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డితో కలిసి పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో 24 గంటల విద్యుత్ ఉండేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అంధకారం అలుముకుందని చెప్పారు. రైతు భరోసా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, దళిత బంధు, ఉచిత విద్యుత్, ఉచిత మంచినీరు వంటి అనేక పథకాలను పేదల సంక్షేమానికి ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌దేనని గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ వచ్చినప్పటి నుంచి ఏ ఒక్క పథకమూ అమలు చేయకపోగా 6 గ్యారెంటీ హామీలను గాలికి వదిలేసిందని విమర్శించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ రోజురోజుకూ బలమైన శక్తిగా ఎదుగుతున్నదన్నారు. పూర్వవైభవం తెచ్చుకుంటూ పార్టీ ముందుకు పురోగమిస్తున్నదన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రజలు ఇప్పటి నుంచే సిద్ధం అవుతున్నారన్నారు. కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకటేశ్, సర్వర్, వహజ్, ఫారుఖ్, మోహిన్‌ఖాన్, రాముయాదవ్, రాఘువేందర్‌యాదవ్, రవి, ఈశ్వర్, రాజు, చిరంజీవి, రాజ్‌కుమార్, అశోక్‌కుమార్, భాస్కర్ పాల్గొన్నారు.



కడ్తాల్ మండల పరిధిలోని గోవిందాయిపల్లి గ్రామపంచాయతీకి చెందిన కేతావత్ గణేశ్, పాత్లావత్ జైపాల్, కేతావత్ గోపాల్, సభావట్ మునీందర్, సభావట్ దశరథ్, సభావట్ నర్యా, సభావట్ మల్లేశ్‌తోపాటు మరో 10 మంది కాంగ్రెస్ కార్యకర్తలు బుధవారం మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారందరికీ ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. – కడ్తాల్, ఫిబ్రవరి 19